# బనారస్‌లో ఫస్ట్ ర్యాంకర్ మనోడే



వెంకటేశ్వర్‌రెడ్డి

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: బనారస్ హిందూ విశ్వవిద్యాలయం ఎమ్మెస్సీ ఆగ్రో-ఫారెస్ట్ ప్రవేశపరీక్షలో తెలంగాణ విద్యార్థులు సత్తాచాటారు. ములుగులోని తెలంగాణ ఫారెస్ట్ కాలేజీ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ (ఎఫ్‌సీఆర్‌ఐ)కు చెందిన నలుగురు విద్యార్థులు సీట్లు సాధించారు. వీరిలో వెంకటేశ్వర్‌రెడ్డి ఫస్ట్ ర్యాంకు సాధించాడు. సిద్దిపేట జిల్లా బక్రిచెపాల్‌కు చెందిన వెన్నెలరెడ్డి పురమండ్ల, ఇందు కాలే, యెరువ తేజశ్రీ ప్రవేశం పొందారు. మొత్తం 23 సీట్లకుగాను నాలుగుసీట్లు మన విద్యార్థులు సాధించడం విశేషం. ఉత్తరప్రదేశ్‌లోని వారణాసిలో 1916లో ఏర్పాటైన ఈ వర్సిటీకి దేశవ్యాప్తంగా మంచి పేరున్నది. సీఎం కేసీఆర్ ముందుచూపుతో స్థాపించిన ఎఫ్‌సీఆర్‌ఐ.. మొదటి బ్యాచ్ విద్యార్థులు ఇటీవలే డిగ్రీ పూర్తిచేశారు. స్కాలర్‌షిప్, ట్యూషన్‌ఫీజు మాఫీతో ఇద్దరు విద్యార్థులు ఇప్పటికే అమెరికాలోని అలబామా యూనివర్సిటీలో ప్రవేశం పొందారు. బెనారస్ వర్సిటీలో సీట్లు సాధించిన విద్యార్థులకు అటవీశాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. ఎఫ్‌సీఆర్‌ఐ సైద్ధాంతిక జ్ఞానం, ప్రాక్టికల్ అప్లికేషన్, ల్యాబ్ టు ఫీల్డ్ అప్లికేషన్‌లో నేర్చుకొనేందుకు అధిక ప్రాధాన్యమిచ్చారని మొదటి ర్యాంకర్ వెంకటేశ్వర్‌రెడ్డి తెలిపారు. బనారస్‌లో సీటు పొందడానికి ఎఫ్‌సీఆర్‌ఐ డీన్, అధ్యాపకులు ఇచ్చిన శిక్షణ దోహదం చేసిందని సిద్దిపేట జిల్లా బక్రిచెపాల్‌కు చెందిన వెన్నెలరెడ్డి పురమండ్ల పేర్కొన్నారు. ఎఫ్‌సీఆర్‌ఐ విద్యార్థిని కావడం అదృష్టంగా భావిస్తున్నానని ఇందు కాలే తెలిపారు. ఎఫ్‌సీఆర్‌ఐ కళాశాల తన జీవితాన్ని, విజన్, మిషన్‌వైపు నడిపించిందని యెరువ తేజశ్రీ వెల్లడించారు.